# ఉప్పనీరు

ఎండలు మండిపోతున్నాయి! బావులు అడుగంటుతున్నాయి. బోర్లు పీక్కుపోతున్నాయి. చెరువులు కుంటల సంగతి చెప్పనక్కరలేదు. ఆ ఊరి జనం తాగునీటికోసం కటకట లాడుతున్నారు. ఏదో ఓ బావిలోనో, బోర్లోనో నీరున్నా వాటిని తాగితే పళ్ళు గారపట్టడం, కాళ్లు చేతులు వంకరపోవటం జరుగుతూవుంది. కొందరి ఇళ్ళల్లోని బావుల్లో కాస్త మంచినీళ్ళు కూడ వున్నాయి. వాళ్ళు ఆ నీళ్ళను పాలకంటె ఎక్కువగా కాపాడుకుంటున్నారు. ఈ రోజుల్లో పాలు-నీళ్ళు ఒకటేకదా? రెంటినీ కొనుక్కుంటున్నాం, పాల క్యానులు పట్నంపోయి నీళ్ళ క్యానులు పల్లెలకు చేరుతున్నాయి. ఎటొచ్చీ కొనుగోలు శక్తే కావాలి. వచ్చిన తిప్పలంతా కూలినాలి జనాలకే. వాళ్ళు నీళ్ళను కూడా దానం అడుక్కోవలసొచ్చింది.

ఎంకులు మంచినీళ్ళ కోసం బావులన్ని తొంగిచూశాడు. కొన్నిటిలో ఇన్నో అన్నో నీళ్ళున్నా వాటిని తాగలేం.

మురికి గుడ్డలతో వొల్లు ఉప్పుబేరి, జుట్టు గడ్డం పెరిగి, దిక్కుమాలినవాడిలాగున్నాడు.

అందుకేనేమో అంతం వరకు ఆడదిక్కు అవసరమంటుంటారు.

మారెమ్మ పోయినప్పటినుండి మనిషి అదో మాదిరిగ మారిపోయాడు. వంటరితనం మనిషిని కుంగదీస్తుంది.

మారెమ్మ గురించి నలుగురు నాలుగు రకాలుగ అంటువచ్చారు. అట్లా అంటేనే వాళ్ళకు తృప్తి కావొచ్చు. ఏ కారణం లేకుండా ఎదుటి మనిషిని ఎందుకు బాదిస్తారో అర్థంకాదు. అసలు మనుషులకు మాటలు రాకుంటేనే బాగుండేదేమో! మాటలు ఈటెలలాంటివి, తుపాకి తుటాలలాంటివి.

ఎవరు ఏమన్నా ఆమె అతనితోనే వుంటువచ్చింది. అతను ఆమెతోనే వుంటువచ్చాడు. వేలుబట్టి ఏడు అడుగులు నడవలేదేమోకాని అన్ని అడుగులు

ఆమెతోనే కల్సి నడిచాడు. వాళ్ళు మనసులు కలిసిన జంట. ఒకరికి ఒకరు నిలిచిన మనుషులు.

ఎంకులు పటేలు ఇంటిముందు నిలుచున్నాడు. చేతిలో మంచినీళ్ళ పటువ, నెత్తిన చినిగిన పాత కండువాగుడ్డ. ఎనభైకి చేరినవాడు. తిండి సరిగాలేక బక్కచిక్కిపోయాడు.

ఎన్నిసార్లు పిలిచినా ఎవరు పల్కలేదు. వాకిట్లో ముడుచుకొనిపడుకున్న కుక్క మొదట 'గుర్'మన్నా ఎంకులును గుర్తుపట్టిన తరువాత కళ్లుమూసుకుని పడుకుంది. మూతిమీద వాలే ఈగలను కాలితో లేవగొట్టుకుంటు నోటిని తెరిచి మూస్తుంది.

'తనను, గుర్తించేవాళ్లు ఎవరున్నారని. పెద్ద పటేలుపాయె. పటేలమ్మాపాయె చిన్న పటేలు పొలానికి పొవచ్చు. ఇగవున్నది చిన్న పటేలమ్మ. ఆమె ఈ ఊరికి కొత్తకోడలు.' అనుకుంటూ

"సుశీలమ్మ గారు, గిన్ని మంచినీళ్లుపొయితల్లీ" అని పేరు పెట్టి పిలిచాడు ఈ సారి.

"ఎన్నిసార్లు చెప్పాలె బావిలో నీళ్లులేవని. కుండో రెండు కుండలో ఊరితే మాకు తాగడానికి, బర్రె కుడితికే చాలవు " అంది ఇంట్లో నుండి ముగ్గుబుట్టతో వస్తూ. ఆమెతో పాటు ఆమె వెనకాల 'మ్యావ్' మంటు ఓ నల్లపిల్లి గడపవరకు వచ్చి ఆగింది. ఇంటిముందున్న కుక్కను చూసి ఆ కారణంగా కోపాన్ని పెంచుకుని తోకనిపైకి ఎత్తి చూస్తూవుంది. అప్పుడు దాని మీసాలు సూదుల్లా నిలుచున్నాయి.

"ఒక్కపటవడు పోయితల్లీ, రొండు పటవల ఉప్పునీళ్లు తెచ్చి కుడితిలో పోస్తగాని" అన్నాడు. తనచేతిలోని పటవనుపైకెత్తి చూపిస్తూ.

"ఎందీ కుడితిలో ఉప్పునీళ్లా , ఆకుడితి తాగితే బర్రె పాలిస్తదా?" అన్నది ముఖం చిట్లించుకుంటు సుశీల.

"ఉప్పునీళ్లు తాగితె కీళ్లనొప్పులొస్తున్నాయి. పటువడు చాలు, మూడురోజులు సరిపోతయి" అన్నాడు ఎంకులు బతిమాలుతూ. ఎంకులు కడుపులో పేగులున్నట్టు లేవు. కాళ్లకు చేతులకు నరాలుతేలివున్నాయి. అవి శరీరానికి ఎలాంటి పట్టునిస్తున్నట్టులేదు. కుడిపాదపు మీగాలు మీదపుండైన గాయం. ఓ సారి బావి తవ్వుతూవుంటె గట్టి మొరుసుమీద గడ్డపార దిగక జారొచ్చి పాదంమీదపడి గాయపరిచింది. మందులు మాకులు పెట్టంగ పెట్టంగ మానినట్టెమాని మళ్లీ రెచ్చుతువుంటుంది. సంపాదించింది సూదిమందులకు, కట్లుగట్టడానికే సరిపోయింది. నల్లని కురుమ దారానికి ఓరాగివుంగరం తొడిగి ఆపాదానికి కుట్టుకున్నాడు. గాయానికి ఓ పాతగుడ్డను చుట్టుకున్నాడు. బాగమాసిన ఈ గడ్డం రంగుకు నేలరంగుకు తేడాలేదు.

సుశీల ముగ్గువేయడంలో మునిగి మాట్లాడడంలేదు.

"అమ్మా ఈ బాయిని నేను, నామారి కల్సి ఇద్దరమే తొవ్వినం" తన ఎదమీద కుడిచేయి వుంచుతూ అన్నాడు అతురుతగ.అప్పుడాయన ముఖం విప్పారినట్టు కనిపించి కళ్ళల్లో నీరు తిరిగింది.

"తవ్వితే కూలి తీసుకోలేదా?" అంది ముగ్గేస్తూనే, మెడలోని పుస్తెలతాడుతో నల్లపూసల గొలుసు కలిసి వేలాడుతున్నాయి.

"ఇంట్లో ఏడుస్తున్న సుశీల కొడుకును చంకన ఎత్తుకుని" సుశీలా బాబుకు పాలిచ్చిపోదురా" అంటు సుశీల తల్లి గడపవరకు వచ్చి నిలుచుంది.

"వస్తున్న తొట్టెల్లో వేసి ఊపు" అంది సుశీల. తల్లిలోనికి నడిచేటపుడు, బాబు ఎంకులును చూస్తు" ఊ,ఊ అంటు చేయి ఆడించాడు.అతని ఆకారం అలా అనిపించేసిందేమో!

"ఈ ఇంటి బాయి తొవ్వేటపుడె నామారి కడుపుపోయింది. ఆ కడుపు పోకుంటే నాకిప్పుడు సోర కొడుకో, బిడ్డో వుండేది. అనుకుంటు తడైన కళ్ళను వొత్తుకున్నాడు. ముఖంలో ఏదో దిగులు చోటుచేసుకుంది. బరువైన నిట్టూర్పు గుండెలో నుండి తన్నుకొచ్చింది. అప్పుడతనికి గతం గుర్తొచ్చి, మారెమ్మ మతికొచ్చింది.

00

చిన్నప్పుడె తల్లీ-తండ్రీ గత్తరలో పోవటం వల్లా ఎంకులును మేనత్త సాదుతూ వచ్చి ఆరేండ్లప్పుడే ఓ గొల్లాయన దగ్గర బట్ట-పొట్టకు గొర్లకాయడానికి వుంచింది. అట్లనే గొర్రెల కాస్తు అడివిలోనే వుంటుండేవాడు. కొంతకాలానికి మేనత్త కన్నుమూసింది. గొల్లాయన ఎంకులు పెళ్ళి విషయం పట్టించుకోలేదు. పెళ్ళిచేస్తే ఎక్కడ తన దగ్గర వుండకుండ పోతాడో అని గొల్లాయన ఆలోచన.

ఒకరోజు అడవిలో గొర్రెలను మేపుతున్నాడు. ఆ పూటే పుట్టిన ఓ గొర్రెపిల్ల సంకలో వుంది. దాని తల్లి ఎంకులు చుట్టే తిరుగుతూవుంది.

తంగెడు కట్టెలకోసం వొచ్చిన పడుచుది మోపు ఎత్తడానికి రమ్మని సైగచేసింది. మొదలు కాస్త తికమకగా చూసినా ఆడసైగ కనుక ఆకర్షితుడై ఆమెవైపు మౌనంగా నడిచి ఎదురునిలుచున్నాడు. అప్పుడు ఆమెకు అతను ఓ గొర్రెపోట్టేల్లాగ కనిపించాడు.

ఆమె నెత్తిన చుట్టబట్ట పెట్టుకొనివుంది. నొదుటి కుంకుమబొట్టు చెమటకు తడిసి ముక్కుమీదికి జారింది. ఆమెవంగి మోపును రెండు చేతులతో లేపుతుంటే, ఎంకులు తన చేతులను ఆసరా యిచ్చి మోపు ఎత్తాడు. ఆమె కాలి వేళ్ళతో కిందవున్న గొడ్డలిని చేతిలోకి తీసుకొని మోపులో చెక్కుకుని "వస్త" అంటు ఊరివైపు

మళ్ళింది. ఆమె సిగలో పచ్చగా తంగేడు పూలు అందంగా వున్నాయి.

"నీపేరు" అడిగాడు "మారెమ్మ" అంటు కదిలింది.

అతను మందవైపు నడిచాడు. స్త్రీని అంత దగ్గరనుండి చూడడం అదే మొదటిసారి.

మరునాడు ఆమె వచ్చింది. మోపు ఎత్తమని సైగచేసింది. ఎంకులు వచ్చి ముసిముసిగ నవ్వుతూ ఎదుట నిలుచున్నాడు.

అతన్ని ఎగాదిగా చూచి "పెండ్లి కాలే" అని అడిగింది కొంగును చుట్ట చుట్టుకుంటు. అప్పుడు ఆమె నిండైన శరీరంవైపు చూస్తు 'నున్నగ మరకున్నట్టే వుందె' అనుకున్నాడు.

'కాలేదు' అన్నట్టు తల అడ్డంగా ఆడించాడు. అప్పుడామెకు అతని కళ్లలో ఏదో కైపుతో కూడిన కాంతి కనిపించింది.

"నీది" అని అడిగినట్టు చూసి నేలవైపు చూస్తు చేతిలోని కర్రతో నేలమీది పిడికను తాకగా అది కదిలి పిడికకు పట్టిన చెదలు వేర్లై చుట్టూర చెదిరిపోతూ వుంది.

"అయిందీ, కాని ఆడు ఇంకోదాన్ని ఏసుకపోయిండు" అంది అతనివైపు చూడకుండా కట్టెలమోపు వైపు చూస్తూ. ప్రక్కనేవున్న చెట్టుకింద ఉడుత మేడిపండును తింటూ వుంది.

"మరి నీ సంగతి" అంటూ ఊడిపోయేంత వదులు అయిన ఆమె కొంగు కింది రవికముడివైపు చూస్తు అడిగాడు.

"ఆని తలపండు పగల ఇడికాయితం ఇచ్చే" అంది కోపంగ. అప్పుడామె కడుపులో ఏదో బాధ సుడులు సుడులుగా తిరిగి ముక్కుగుండ బయటికిరాగ ముక్కుపుటలు కదిలినయి.ముఖంలో మార్పు కనిపించింది.

మనిషికి బాధకలిగినపుడు చూపుల్లో మార్పు వస్తుంది కదా!

'అయ్యో' అన్నట్టు చూస్తువున్నాడు ఎంకులు. ఆమెపై జాలి, ప్రేమ, దగ్గరితనం ఒకదానివెంట ఒకటి పుట్టుకొచ్చాయి.

"ఎత్తు" అంటు వొంగి అతనిలో వచ్చిన మార్పును గమనించింది. తాను వంగాడు మోపు ఎత్తడానికి. ఇద్దరు ఒక్కసారె వంగేసరికి ఒకరితల మరొకరికి తగిలింది. అప్పుడు ఒకరి కళ్ళలోకి మరొకరు మౌనంగా చూసుకున్నారు. అప్పుడు వాళ్ళ శరీరాలలో ఆయస్కాంతపు వలయాలు తిరిగాయి. ఆ తరువాత మోపు ఎత్తాడు. ఆమె ఊరిబాట పట్టింది. కాసేపు ఆమెను, ఆమె సిగలోని గడ్డిపూలు చూస్తు నిలుచున్నాడు. ఆ తరువాత మందవైపు మళ్ళి రేల ఆకులను పెదాల మధ్యనుంచి ఈల వేశాడు గొర్రెలన్నీ తలెత్తిచూశాయి. తనచేతిలోని దుడ్డుకర్రను

తలపై గాలిలో తిప్పుతు మందవైపు నడుస్తుంటే మదిలో చెప్పలేని ఆనందపు అలలు! అప్పుడతనికి ఆకాశం చాలా విశాలంగా కనిపించింది. ఆకాశంలోని ఒకటి రెండు మేఘాలు మారమ్మలాగ కనిపించాయి. అంతేకాదు ఆమెనెత్తిన కట్టెల మోపు ఉన్నట్టుగా కూడ కనిపించింది. ఆమె నడిచినట్టే అవి వున్నచోటు నుండి కదిలినయి.

మరునాడు ఓ ముంతనిండా కల్లుతోవచ్చి, ఎంకులును రమ్మని సైగచేసింది. సైగకు సమ్మోహన శక్తి వుంటుంది అంటారు. కదా అదె జరిగింది.

ఎంకులు వచ్చాడు 'కూకోవొంపుతా' అన్నట్టు చూస్తు ఆకును అందించింది. అప్పుడు వేళ్ళు వేళ్లు తాకుకున్నాయి. ఇద్దరివంట్లోను ఏవో స్పర్శా తరంగాలు కదిలినట్టుగా వాళ్ళ కళ్ళు కనురెప్పలు చెపుతువున్నాయి.

కళ్లు రహస్యాన్ని దాయలేని దర్పణాలు. మనస్సులో వున్నదాన్ని చూపులు చెపుతాయి.

ఎంకులు ఆకు అందుకుని కూర్చున్నాడు. కల్లు వంపుతున్న ఆమె చూపులు అతని నూలుగు మీసాల మీద, ఆ తరువాత పిక్కెలమీద ఆగినయి. అప్పుడామె పెదవులు దగ్గరై బిగ్గరయినయి ఆకులోని కల్లులో ముఖపు నీడ.

అతను ఆమెకు, ఆమె అతనికి ముంత ఖాళీ అయ్యేంతవరకు వంపుకున్నారు. ఇద్దరు ఒకే ఆకులో తాగారు. దగ్గరితనం ఎంగిలిని లెక్కచేయదు. రుచిని పెంచి తృప్తినిస్తుంది. మొదలే ఎర్రగావున్న ఆమె ముఖం తాగడం వల్ల మరింత ఎరుపెక్కింది. అతని కళ్లూ ఎరుపెక్కినయి. ఇద్దరి కనురెప్పలు తెరిచిన తలుపులైనయి. తలుపులు తెరవగానే ఇంట్లోకి గాలి-వెలుతురు కలిసొచ్చినట్టు, వాళ్ళ ముఖాల్లోకి సిగ్గు-చిరునవ్వు ఒకేసారొచ్చి చూపుల్లో తడబాటు చోటుచేసుకుంది.

"నన్ను మనుమాడుతవ" అని అతని కళ్ళలోకి చూస్తు అడిగినపుడు మధ్యలో మాటను కొంచెం మింగిన ధ్వనితో అతని జవాబుకోసం ముఖంలోకి చూస్తూవుంది.

'సరే' అన్నట్టు తల ఆడించాడు.

వంటరి తనం, వయస్సు ఆరాటం, తాగిన మత్తు అట్లా అనిపింపచేశాయి. ఆ స్థితి అంతే!

ఆరోజు పొద్దుకూకే వేళ్ళ మబ్బులవైపు చూశాడు. ఓ మబ్బు మళ్ళీ మారెమ్మ ఓలె కనిపించింది. అంతేకాదు, కూకుతున్న పొద్దు ఆమె సిగలో తంగేడు పువ్వు ఓలె కనిపించింది. అంతే, ఎగిరిగంతేసి దుడ్డు గర్రను గాలిలో తిప్పుతు మందను తరిమాడు. అవి బెదిరి బెదిరి గుంపులు గుంపులుగా పరుగుతీశాయి.

దళితుల్లో మారుమనువు స్వేచ్ఛ ఎప్పటినుండో వస్తూవుంది. దళిత స్త్రీ పరాన్నజీవి అస్సలుకాదు. తనకాళ్ళమీద తాను నిలబడె కష్టజీవి. కొడవలి అందుకున్న సుత్తె అందుకున్న ఆ పూటకు లోటుండదు. దేశ సంపదను పెంచె...

అంతె మందకాడి ఎంకులు మారమ్మ గుడిసెకు చేరాడు. ఒంటరిగావున్న మారమ్మకు ఎంకులు తోడైనాడు. లోకులు కాకులైనారు. ఎవర్ని పట్టించుకోనంత ఒక్కటయినారు.

00

ఎంకులు చిన్నప్పటి నుండి పచ్చిపాలు తాగి పెరిగాడు. రాతి విగ్రహం లాగున్నాడు. ఛామనచాయ, కాలుచేయి పెగిలి వల్లుచేసిన మారమ్మ ఎంకులుకు తగినజోడు. పొట్టకోసం తట్ట-పార చేతపట్టారు. పాతాళంలో వున్న నీటిని బయటికి తెప్పించడమే వాళ్ళపని. చేదబావులతో పాటు వ్యవసాయ బావులను తవ్వుతూ వచ్చారు. ఎప్పుడు మట్టినే తవ్వుతు మట్టిమట్టిగ కనిపించేవాళ్ళు. ఎంకులు ఇంటిపేరే గడ్డపార ఎంకులు అయ్యింది. అట్లా పిలుస్తుంటే మారమ్మకు మంచిగనిపించేది. తనవాడు సరియైన మగాడు అని మురిసేది. ఎంకులు వంటిమీద చెమట చిత్తడిని తన పయిటకొంగుతో తూడుస్తువుండేది. చింత చిగురు తెంపుకొచ్చి వట్టిచేపలేసి వండి ఎదురెదురుగా కూర్చొని తినేవాళ్ళు.

ఓ రోజు చెవిలో ఏదో చెప్పింది. ఎంకులు ఎగిరి గంతేశాడు. సూర్యునికి దండం పెట్టాడు. మందలో గొర్రెపిల్ల పుడితె ఎత్తుక తిరిగేటోడు. ఇక తనకె ఓ బిడ్డ పుడితే! భార్యకు ఖజ్జూరపండు తినిపించాడు. తీయని కల్లు తెచ్చి తాపించాడు.

తరువాత ఇదే పటేలు ఇంట్లో సేదబావి తవ్వుతున్నారు. ఎంకులు బావిలో మట్టిని తట్టలోకి ఎత్తుతున్నాడు. మారమ్మ మట్టి తట్టను పైకి లాగుతూవుంది. లాగిన మట్టితట్టను పక్కకు గుమ్మరించబోయి పడిపోయింది. అంతకుముందు రోజులు పోసిన మట్టి గట్టిగై గడ్డలాగైంది. పడే పడటమే గడ్డమీదపడిపోగ కడుపుకు దెబ్బదగిలింది.

'బావి బలితీసుకుంది' అన్నారు కొందరు.

'పెండ్లి పెడాకులు లేక పిల్లలు కనాలనిచూస్తె గంతె' అన్నవాళ్ళూ వున్నారు.

ఆ తరువాత మారెమ్మ మల్లెపుడు నెలతప్పలేదు. అప్పటినుండి ఆమె ముఖంలో కళ కనిపించలేదు. ఆమె వంటి రంగు వన్నెకూడా తగ్గింది.

బతుకు జ్ఞాపకాల నుండి తేరుకుంటూ-

"కొన్నయినా పొయ్యి తల్లి" అన్నాడు ఎంకులు. బావులు తవ్వేటప్పుడు బురద-బురద నీళ్ళు పడి, తడిసి తడిసి, నాని నాని నల్లగ మారిపోయాడు.

ముగ్గువేయడం ముగించుకొని ఎంకులును పట్టించుకోకుండా లోపలికి వెళ్లిపోయింది పటేలమ్మ. 'తాను, తన భార్య చెమటోడిచి తవ్వినబాయి ఇది' అని నిట్టూర్చుతూ అక్కడి నుండి కదిలాడు ఎంకులు.

శిలలాంటి మనిషి కాలం తాకిడికి వరికంకిలాగ వంగాడు.

00

ఎంకులు ఖాలి పటువతో తన ఇంటివైపు నడుస్తువున్నాడు.

తోటి కూలి రాములు ఎదురై "ఏందే ఎంకన్న గిట్లైనవు. వొదిన బోయి నిన్ను వంటరిని చేసింది గదనే".

ఎంకులు మాట్లాడలేదు. మూగగా తల ఆడించాడు.

"మా ఊరే నీ కొంప ముంచింది. ఆ బావి పూడిక పట్టకున్నా బాగుండేది" అంటూ అంగలార్చాడు రాములు.

ఎంకులు-మారెమ్మతోపాటు రాములు అతని భార్య, మరోజంట బావిలో పూడిక తీసే పనిపట్టారు. ఎంకులు, మరో ఇద్దరు మగవాళ్ళు బావిలోకి దిగారు. ఇద్దరు తవ్వుతుంటే ఎంకులు తట్టలోకి ఎత్తుతున్నాడు. పైన వున్న ముగ్గురాడవాళ్ళతో ఇద్దరు కాడి గుంజుతున్నారు. మారెమ్మ మోట దగ్గర వంగి, తట్టను అందుకుని పక్కకు గుమ్మరిస్తూ ఖాళీ తట్టను బావిలోకి వదులుతూ వుంది. అట్లా పొద్దుకూకే వరకు పనిచేస్తు వచ్చారు. ఇక పని దిగేవేళ. ఆఖరి తట్ట అందుకోబోగా మోట బావిలోకి వంగింది. మారెమ్మ వేసిన కేకలకు బావిలోని వాళ్ళు పక్కకు జరిగి నిలుచున్నారు. బావి మధ్యలో మోట, ఆ తరువాత మోట మొద్దుల మీద మారెమ్మ పడిపోయింది. బావి రక్తం మడుగైంది. ఎవరి నోట మాటరాలేదు.

ఈ బావుల తొవ్వకమే బతుకును బండపాలు చేసిందని కుమిలిపోయాడు ఎంకులు.

జవాబు ఇవ్వడానికి రాములుకు మాటలు రాక మౌనంగా నిలుచున్నాడు.

ఈ మాటలన్నీ తాము చేయలేని పనిని ఇతరులచేత చేయించుకోవడానికి ఏసే ఎత్తులు, జిత్తుల మారి మాటలు. ఇలాంటి బుదగరింపు మాటలకే అమాయకులు ప్రాణాలను సైతం పోగొట్టుకుంటువుంటారు.

ఎంకులు ఓ బరువైన నిట్టూర్పు వొదిలాడు. రెట్టలకు, పిక్కెలకు నరాలు తేలినయి. కాళ్ళ వేళ్ళు వంకరలు తిరిగాయి. ఒకప్పుడు గడ్డపారకు శక్తినిచ్చిన నరాలు అవి.

"ఆసామి నాకొడుకు ఇచ్చిన బస్తా వడ్లు చావు ఖర్చుకు కూడ చాలలేదు" అన్నాడు ఎంకులు.

"మనమే తప్పు చెప్పినం' ఆమెకు సొమ్మరోగముండె, తొంగిచూడపోయి

బాయిలో పడిచచ్చింది" అని బాయోడు చెప్పితె 'అవునంటిమి' లేకపోతె పీనిగను ధావఖానకు తీసుకపోయి ముక్కలు ముక్కలుగ కోస్తరని మన భయం మనకుండె" అన్నాడు రాములు ఆనాటి పరిస్థితిని వివరిస్తు.

ఎంకులు ఏం మాట్లాడలేదు. కళ్ళు–ముక్కు తడైనయి. ఎక్కువగా ఏడ్వడంవల్లా కావచ్చునేమో కన్నీళ్ళకు తడిసిన ఎంకులు గడ్డం గోగునార రంగులోకి మారింది.

"ఇప్పుడేమనుకుంటే ఏమొస్తది. సాకిరి చేయడానికే పుట్టినం. ఆ సాకిరిలో చావు ఎదురొచ్చినా చావవల్సిందే. మన చావుకు తలరాతే తప్ప ఏ కారణముండదు. కారకులు అస్సలుండరుగదా. మన బతుకులేవొట్టి దిక్కులేని బతుకులు, బాధలన్నీ మనపాలిటే. దేవుడంటోడు కూడ అందర్ని ఒక తీరుగచూడడే" అన్నాడు రాములు.

"ఎండ ఎక్కువైంది దూపోటైతుంది. వస్త" అంటూ ఊళ్ళోకి నడిచాడు రాములు.

ఎంకులు ఎడ్డిచూపులు చూస్తు కదిలాడు. కళ్ల వదిలిన నీరు పెదవులమధ్యన ఆగి ఉప్పుప్పు అనిపిస్తుంటే నడవలేక నడుస్తూ 'ఇదీ ఓ బతుకా' అని ఆలోచిస్తున్నాడు. పుట్టుకతో పుట్టెడు బాధలు! పెరుగుతూ పేదరికపు బాధలు!! అడవిలో మందను కాసినపుడే మామూలు బతుకు. కాయలు పండ్లు తిని, వాగునీరు తాగేది. నక్కలు, తోడేళ్ళు, పాములు–తేళ్ళు తాను తరిమితే పారిపోయేవి. ఊళ్ళో అట్లాకాదు బాదర బందీలు తననే తరుముతున్నాయి. కాలం కొట్టిన దెబ్బలకి కూలి దొరకని కాలమొచ్చే. బట్ట–పొట్టకు కరువొచ్చె. పది–పదియేను ఏళ్ళనుండి బోరులేయడం వచ్చి బావులు తవ్వటం లేనే లేదాయె! ఈ మిసన్లూ, బోరులొచ్చే కూలోల్ల నోళ్ళు కొట్టే. పాతబావుల పూడిక తీయడం తప్ప, కొత్తబావులు తవ్వకం ఎక్కడిది. గడ్డపార ఎంకులుకు గంజి గతిలేకుండా పోయింది. పునాదులు తవ్వటం. బొందలు తవ్వటమే ఇక పని.

అవి ఎన్నాళ్ళు నడుస్తయి. ఎంతమంది బతుకుతరు. అప్పటినుండి మొదలైంది. పూట గడవని స్థితి. రాను రాను గడ్డపార మూలకు చేరింది! డొక్క వెన్నంటుకపోతువుంది! అంటు కడుపును ఓసారి చేత్తో తడుముకున్నాడు.

అవును ఈ కూలినాలి జనం బతుకంతా పనిచేసి నరాలలో సత్తువ తగ్గి, ఎముకల్లో మూలిగ కరిగి అంతకు ముందు నుండి చేస్తూ వచ్చిన పనులను చేయలేక పోతారు. అప్పుడు పూట ఎట్లా గడుస్తుందో అని ఎందరు ఆలోచిస్తారు? ఇప్పుడు ఎంకులు గురించి ఎవరాలోచిస్తారు. తాను తవ్విన బావినీళ్ళే తనకు దొరకని స్థితి. ఒకే ఊళ్ళో బతుకుతున్నా ఒకరి నొకరు ఆదుకోలేని పరిస్థితిలో వుంటున్నాం.

00

పొద్దుకూకేవేళ్ళ. పశువులు ఊరు చేరుతున్నాయి. పక్షులు గూడు చేరుతవున్నాయి.

దళితవాడలో ఎంకులుది పాత పెంకుటిల్లు. ముందు తాటాకుల పందిరి, పందిరి కింద కాలిపటువ నుంచి వసారలోని నులకమంచంమీద మధ్యాహ్నాం వొచ్చి వొరిగితే అంతే ఇకలేవనేలేదు.

వాకిట్లో వున్న వేపచెట్టు రాల్చిన ఆకులు వాకిలంతా పరిచినట్టున్నాయి.

పక్కింటి స్త్రీ నిప్పుకోసం వచ్చి పిలిచింది. ఎంకులు పలకలేదు, కదిపిచూసింది, కదలలేదు.

"దేవుడో ఎంకన్న చచ్చిపోయిండో" అని గొల్లుమంది. ఆ ఏడుపు విన్న చుట్టుపక్కల వాళ్ళొచ్చి చేరారు.

"ఇన్ని నీళ్ళందుకోండి, ముఖంమీద చల్లుదాం" అన్నారు అక్కడికి వచ్చినవాళ్ళు.

ఏ కుండలో చూసినా నీటి చుక్కలేదు. ఇంటి వెనుక-ముందు ఓ చేదబావి కూడలేదు.

"ఊరంత బావులు తవ్విన ఎంకులు యింటిముందు ఓ బావినైనా తవ్వుకోలేదే!" అన్నారు అక్కడికొచ్చిన వాళ్ళు.

అవును ఎందుకు తొవ్వుకోలేదు?

• 2001